రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



మంజీరా రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డుకు మహర్దశ కలగనుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డులో నూతనంగా చేపట్టిన రోడ్డు పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం లీకేజీలు, గుంతల సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ 7 కిలోమీటర్ల మేర, రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంజీరా రోడ్డుతో పాటు మైత్రీనగర్ ఫేజ్ 3 కాలనీ రోడ్డు పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ స్రవంతి, ఏఈ ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, ఇబ్రహీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఆదిత్య మౌర్య



గోల్డ్ మెడల్ సాధించిన ఆదిత్య మౌర్య

మియాపూర్: బాక్సింగ్ జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మహంకాళి ఆదిత్య మౌర్యను బుధవారం కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఆదిత్య మియాపూర్ శ్రీ వశిష్ట కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా ఈ నెల 22, 23, 24వ తేదీలలో లాలాగూడలో రైల్వే స్కూల్‌లో జరిగిన పోటీల్లో మహంకాళి ఆదిత్య మౌర్య గోల్డ్ మెడల్ సాధించాడు. డిసెంబర్ 8 నుండి 15 వరకు నోయిడాలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకి ఎంపిక అయ్యాడు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని శ్మశానవాటిక స్థలంలో చెత్త డంపింగ్ చేస్తున్నారని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా ఇప్పటికి ప్రగతినగర్ ప్రాంతవాసులు శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశానవాటికలో గదులు ఉన్నా కిటికీలు లేవని, తాగునీటి వసతి, ఇతర వసతులు కల్పిస్తే ప్రగతినగర్ సమీప ప్రాంతవాసులకు వీలుగా ఉంటుందన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశామని, సిబ్బందితో శుభ్రం చేయించి వసతులు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

త్వరలో ఈదులకుంట చెరువు సర్వే

హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఈదులకుంట చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లోని ఈదులకుంట చెరువును శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదులకుంట చెరువు పునరుద్ధరణ నిమిత్తం పరిశీలించామని తెలిపారు. ఇటీవల ఈదులకుంట చెరువు ఆక్రమణకు గురవుతుందని పలు ఫిర్యాదులు వచ్చాయని త్వరలోనే వాటి వివరాలు అందజేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. ఖానామెట్ సర్వే నంబర్ 7లో 6.05 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని కబ్జాకు గురవుతుందని ఫిర్యాదుల నేపథ్యంలో త్వరలో సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో హైడ్రా , రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దోమడుగులో మహర్షి భగీరథ విగ్రహం ఆవిష్కరణ



జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో మహర్షి భగీరథుడి విగ్రహాన్ని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3 లక్షలు సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్, గ్రామ పెద్దలు, నాయకులు హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై కళాజాత

జిన్నారం (పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తోంది. బుధవారం జిన్నారం మండల కేంద్రంలోని వావిలాల, మంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా పాలన విజయోత్సవాలపై కళాకారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ ఆటపాటలతో ప్రజలలో చైతన్యం నింపారు. కార్యక్రమంలో కళాకారులు సునీల్, రమేష్, దుర్గేష్, మల్లేష్, సంధ్య, వినేష్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కళాకారులు

మల్కంచెరువు మెరిసేదెప్పుడు..?

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని మల్కంచెరువు సువిశాలంగా ఉండడం.. రోడ్ సైడ్ లేక్ కావడంతో దీన్ని వీకెండ్‌స్పాట్‌గా మార్చాలని గత ప్రభుత్వం అపర్ణా నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో మల్కం చెరువు సుందరీకరణకు పలు ప్రతిపాదనలు చేశారు. వాటిలో కొన్నింటిని మాత్రం అమలు చేశారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో వీకెండ్ స్పాట్ ప్రతిపాదన నిలిచిపోయింది. ముఖ్యంగా మల్కం చెరువు గొలుసుకట్టు చెరువు కావడంతో మాదాపూర్‌లోని దుర్గం చెరువు– మల్కంచెరువు రూట్‌ను కలిపేలా రోడ్డును ప్రతిపాదించారు. ఇది పూర్తయితే నగర ప్రజలకు చక్కని అనుభూతినిస్తుంది.

- మల్కంచెరువుకు 51.30 ఎకరాల స్థలం ఉండడంతో రూ.30 కోట్లతో మరింత అభివృద్ధి చేసి నగర శివారులో మరో వీకెండ్ స్పాట్‌గా మార్చాలనే ప్రతిపాదనతోనే ప్రణాళికలు రూపొందించారు.
- కానీ ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి
- ముఖ్యంగా నీటిపారుదల విభాగం, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు మారడంతో.. భవిష్యత్‌లో ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకుంటాయా అని స్థానికులు, సందర్శకులు సందేహం వెలిబుచ్చుతున్నారు.
- కానీ ప్రతిపాదనలన్నీ కార్యరూపందాల్చిస్తే శివారులో ఆకట్టుకునే, సేదతీరే ప్రదేశంగా మారడం ఖాయం. కాగా ఇప్పటి వరకు చేపట్టిన పనులతో ఈ చెరువు రూపురేఖలు మారిపోయాయి.

ప్రతిపాదనల్లోనే వీకెండ్‌స్పాట్



మల్కంచెరువు సుందరీకరణలో భాగంగా నిర్మించిన ఎంట్రెన్స్ ప్లాజా

ప్రతిపాదనలకే పరిమితం..

- మల్కం చెరువు గొలుసుకట్టు చెరువు కావడంతో మాదాపూర్‌లోని దుర్గంచెరువు– మల్కంచెరువు రూట్‌ను కలిపేలా రోడ్డును ప్రతిపాదించారు. ఇది వాకింగ్, సైక్లింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావించారు. కానీ అమలుకు నోచుకోలేదు.
- అర్ధచంద్రాకారంలో ఆంపీ థియేటర్, లేజర్ షోలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్థలం ప్రతిపాదించారు. కానీ ఏర్పాటు చేయలేదు.
- యోగాకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేక యోగా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అది కాగితాలకే పరిమితమైంది.
- ఈ ప్రాంతంలో భారీ బండరాళ్లు ఉండడంతో రాక్ గార్డెన్, కేఫెటేరియా, వాటర్ ఫౌంటేన్లు, బోటింగ్ తదితరాలన్నీ అలాగే మిగిలిపోయాయి.
- ఇప్పటికైనా ప్రతిపాదనల అమలుకు ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహా పడిపూజ



ఆల్విన్‌కాలనీ: బాలాజీనగర్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజను కోట రవీందర్, కోట సాయిచంద్ గురుస్వాములు బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి, రంజిత్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



ఆల్విన్‌కాలనీ: కార్తీకమాసం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్‌లోని శ్రీ సుందరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మారెళ్ల శ్రీనివాసరావు, మారెళ్ల హిమబిందు, వాస్తు సిద్ధాంతి సురేష్ వశిష్ట, నీలం సత్యనారాయణ, ఎం రాజా, దేవి సుజాత, వసంత పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని 7వ ఫేజ్ వద్ద ఎస్టీపీ ప్లాంట్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న ట్రంక్ సీవరేజ్ పైపులైన్ పనులను బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఎం ప్రభాకర్‌రావు, డీసీఎం షంషీర్, టీఎస్ ట్రాన్స్‌కో శ్రీనివాస్, డీఈ శ్రీదేవి, ఏఈ సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు, మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ అపార్ట్‌మెంట్స్, వినాయక్‌నగర్, మైత్రీనగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- భవానీపురం ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, శంకర్ నగర్, ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్, సురక్ష ఫీడర్ పరిధిలో.. విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డినగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెచ్‌టీ సర్వీస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో.. 11 కేవీ రాజీవ్ గృహకల్ప విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సుమన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాజీవ్‌గృహకల్ప ప్రాంతం, పాపిరెడ్డికాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు

- సుదర్శన్‌నగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. విద్యుత్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు అలిండ్ కాలనీ, సుదర్శన్‌నగర్ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు పొడిగించాలి..

సీపీఎం పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు: మెట్రో రైలును ఇస్నాపూర్ వరకు పొడిగించాలని సీపీఎం పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా బుధవారం మండలంలోని ఇస్నాపూర్‌లో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... సీపీఎం ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజల సౌకర్యార్థం మెట్రో రైలు పొడిగించాలని లింగంపల్లి నుంచి సంగారెడ్డి వరకు మహా పాదయాత్ర నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగాధర్‌రావు, మూర్తి, శ్రీనివాస్, సురేష్, శంకర్ మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిధి ఆప్‌కే నిఖత్



పీఎఫ్ పత్రాలు అందజేసిన కమిషనర్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. బుధవారం ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన 20 మంది చందాదారులకు ప్రయాస్ పథకం ద్వారా జారీ చేసిన పెన్షన్ పత్రాలలో 7 మందికి డివిజన్ పరిధిలోని వాల్యూ జోన్‌లో జరిగిన నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి, ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్

మోతీనగర్: సోలార్ సిస్టం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్‌ని ఉపయోగించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఎర్రగడ్డ సెక్షార్ ఎలక్ట్రిసిటీ ఏఈ మానస అన్నారు. మూసాపేట డివిజన్ అవంతినగర్‌తోటకు చెందిన స్పోర్ట్స్ ప్రసాద్ నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్ సిస్టంను బుధవారం మాజీ కౌన్సిలర్ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిస్టంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణస్వామి, మాజీ అధ్యక్షులు గార్లపాటి మోహన్‌రెడ్డి, నాయకులు రాజేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

వృత్తిపరమైన శిక్షణ అవసరం

మనూ వీసీ ప్రొ.ఐనుల్ హసన్

రాయదుర్గం: ప్రభావవంతమైన విద్యా విషయాలను రూపొందించడంలో వృత్తిపరమైన శిక్షణ అవసరమని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ న్యూస్ బులిటిన్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఐఎంసీ డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో నాణ్యమైన విద్య అవసరమన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ఐఎంసీలో నిర్మాత–1 ముజాహిద్ అలీ, డాక్టర్ అస్లామ్ పర్వేజ్, డాక్టర్ ముస్తఫా అలీ సర్వరీ, ఎండీ అమీర్ బాదర్‌లు న్యూస్ రైటింగ్, ఎడిటింగ్, ప్రొడక్షన్ గురించి వివరించారు. అనంతరం మనూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లు.. ప్రజల అవస్థలు

ఆల్విన్‌కాలనీ: గుంతలు పడ్డ రహదారులతో స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భాగంగా రోడ్లను తవ్వి పనులు పూర్తి అయి నెలలు కావస్తున్నా రోడ్లు వేయకపోవటంతో వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌యంసీ, వాటర్ వర్క్స్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. తవ్విన రోడ్లలో జీహెచ్‌యంసీ అధికారులు రోడ్లు వేయాల్సి ఉంటుంది. కనీసం ప్యాచ్‌వర్కు అయినా చేయాల్సింది పోయి పూర్తిగా వదిలి వేయటంతో రహదారి ప్రమాదకరంగా మారుతోంది. కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 జలకన్య సెంటర్ పార్కు సమీపంలోని అంతర్గత వీధుల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సుమారు ఆరు నెలల క్రితం డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్వి ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. స్థానికులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీని నిర్మించిన కొద్ది రోజులకే తవ్విన ప్రదేశాల్లో ప్యాచ్ వర్కు పనులు చేయాల్సి ఉంటుంది. అధికారుల సమన్వయ లోపం కారణంగానే సమస్య పరిష్కారమవడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్కూలు బస్సులు, ఆటోలు రావటానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.







ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2 జలకన్య సెంటర్ పార్కు సమీపంలోని రోడ్ల దుస్థితి

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 50, ఆలు 40, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 60, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 40 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 100, వెల్లుల్లి 400.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. బుధవారం గుట్టల బేగంపేట్‌కు చెందిన హనుమంతుకు సీఎం రిలీఫ్‌ఫండ్ రూ. 2.5 లక్షల మంజూరు పత్రాలను అందజేశారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లో బుధవారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 173 మంది లబ్ధిదారులకు ఒక కోటి డెబ్బై మూడు లక్షల ఇరవై వేల రూపాయల సాయాన్ని లబ్ధిదారులకు అందజేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ప్రసాద్, లక్ష్మీ నారాయణ, శ్రీధర్ రెడ్డి, ఎల్లంనాయుడు, అష్రాఫ్, పోశెట్టి గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం



స్థానికులతో మాట్లాడుతున్న జగదీశ్వర్ గౌడ్

చందానగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయికాలనీ, మదీనాగూడలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీహరిగౌడ్, శివకుమార్, ప్రసాద్, కిషోర్, రవి, భాను, చలపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హుడా పార్కును ప్రారంభించాలని వినతి

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన హుడా పార్కును త్వరగా ప్రారంభించాలని కోరుతూ బుధవారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి పాపిరెడ్డినగర్‌వాసి చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సంజీవరెడ్డి, లక్ష్మీ నారాయణ, చర్ల రామకృష్ణారెడ్డి, మాయ రాజయ్య, సింగిరెడ్డి, భూపాల్ రెడ్డి, ఏళ్లం నాయుడు, చిట్టిరెడ్డి గోపాల్‌రెడ్డి, మాయ బాలనర్సయ్య, రొండ్ల మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చలి.. ఉన్ని దుస్తుల కొనుగోలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చలి పెరగడంతో ప్రజలు ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణాల్లో స్వెటర్ల అమ్మకాలు జోరందుకున్నాయి. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ లకు చెందిన వారు నవంబర్‌లో ఇక్కడకు వచ్చి 6నెలల పాటు ఉంటారు. వేసవి, వర్షాకాలంలో వారి గ్రామాలలో వ్యవసాయం చేస్తారు. చలికాలంలో ఇక్కడ వ్యాపారం చేస్తారు. స్వెటర్ల నాణ్యతను బట్టి రూ.250 నుంచి రూ.1500 వరకు అమ్ముతున్నారు. ఈ ఏడాది చలి ఎక్కువగా ఉండటంతో వ్యాపారం బాగుందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతి మేరకే నిర్మాణాలు చేపట్టాలి

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను తిరిగి నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామపంచాయతీ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం పరిధిలోని ఆర్ కే -2 నవ్య సెంటర్‌లో గ్రామపంచాయతీ నుండి తీసుకున్న అనుమతులకు మించి నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. పట్టించుకోకపోవడంతో కూల్చి వేస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. పంచాయతీ నుండి తీసుకున్న అనుమతులు మేరకే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

భగీరథమ్మ చెరువులో మట్టిపోసినందుకు సంధ్య కన్‌స్ట్రక్షన్స్‌పై కేసు

సాక్షి,సిటీబ్యూరో: ఖాజాగూడలోని భగీరథమ్మ చెరువులో మట్టి పోసిన సంధ్య కన్‌స్ట్రక్షన్స్‌పై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువుల్లో మట్టి పోయకుండా హైడ్రా నిఘా పెట్టిన విషయం విదితమే. ఈ నెల 26న వేకువ జామున 3 గంటలకు టిప్పర్లతో భగీరథమ్మ చెరువులో మట్టిపోస్తున్న దృశ్యాలను హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలు కనుగొన్నాయి. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం అందించాయి. జేసీబీతో మట్టిని చదును చేస్తుండగా పట్టుకొని రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జేసీబీ ఓనర్ సురేష్ పై ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జేసీబీతో పాటు మట్టిని తరలించింది సంధ్య కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులుగా తేలడంతో యజమాని శ్రీధర్ రావు తో పాటు వెంకటేశ్వర రావు, సుంకర వీర వెంకట సత్యనారాయణ మూర్తి, మణికంఠ లపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.